


సొంతింటి కలకు అవకాశం

వైసీపీ హయాంలో పేదోడి సొంతింటి కలను తీర్చడమే కాదు.. జగనన్న కాలనీల పేరుతో ఊర్లకు ఊర్లను నిర్మిస్తామని ఊదరగొట్టారు. ఐదేళ్ల పాలనలో ఆశించిన స్థాయిలో నిర్మాణాలు సాగలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పేదోడి సొంతింటి కల అలాగే మిగిలిపోయింది. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టి వేగవంతం చేస్తోంది. పీఎంఏవై గ్రామీణ్ 2.0 కింద దరఖాస్తులను స్వీకరణకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 31,929 మంది దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా గడువు పెంపుతో ఈనెల 14వ తేదీ వరకు సదరు సర్వే యథావిధిగా చేసి అర్హులైన పేదల వివరాలను పక్కాగా నమోదు చేయనున్నారు.

- జిల్లాలో ఇప్పటికే 31,929 మంది దరఖాస్తు
- 14వ తేదీ వరకు గడువు పెంపు
- మరింత పేదలకు లబ్ది చేకూరేలా చర్యలు



నంద్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను తీర్చేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ప్రధానమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన (పీఎంఏవై గ్రామీణ్2.0) కింద గ్రామీణా ప్రాంతాల్లో అర్హులైన పేదలకు సొంతింటి కలను తీర్చడానికి శ్రీకారం చుట్టి సర్వే చేపట్టింది. ఇందులో భాగంగా గత నెల 30వ తేదీ వరకు సర్వేతో పాటు అర్హులైన పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. తాజాగా గడువును ఈనెల 14వ తేదీ వరకు గడువు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ శ్రీహరిగోపాల్ ప్రకటించారు.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా

నియోజకవర్గం	దరఖాస్తులు
నంద్యాల	1426
ఆళ్లగడ్డ	4179
శ్రీశైలం	4180
బనగానపల్లె	7591
నందికొట్కూరు	7867
డోన్	4741
పాణ్యం	1945
మొత్తం	31,929



దొర్నిపాడులో ఆరా తీస్తున్న పీడీ శ్రీహరిగోపాల్ (ఫైల్)

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వచ్చిన దరఖాస్తుల వరంగా పరిశీలిస్తే బనగానపల్లె- 7,591, నందికొట్కూరు-7,867 మంది చొప్పున దరఖాస్తు చేసుకున్నట్టు అధికార లెక్కల ద్వారా తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయాల్లోని 488మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఇంటింటా సర్వే చేపట్టారు. తద్వారా జిల్లాలో 31,929 మంది పేదలు ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ పరిధిలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక యాప్ ద్వారా సొంత నివాస స్థలం ఉందా..? లేదా.. ఇంటి పట్టా కలిగి ఉన్నారా..? ఇలా పలు రకాలుగా ఇల్లు లేని పేదలను గుర్తించి యాప్‌లో ఎక్కడికక్కడ నమోదు చేశారు.



అవుకులో పరిశీలిస్తున్న హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ (ఫైల్)

ఇళ్లు మంజూరు కావాలంటే..

ఎవరైనా ఈపథకం కింద ఇళ్లు మంజూరు కావాలంటే తగిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇంటి స్థలం లేదా ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా కలిగి ఉండాలి. అదేవిధంగా తెల్లరేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, భార్యాభర్తల ఆధార్ జిరాక్స్ సమర్పించాలి. గతంలో గృహ నిర్మాణ పథకం కింద లబ్ధి పొంది ఉండరాదు. ఇదిలా ఉండగా. ఎవరైనా గతంలో ఎవరైనా లబ్ధి పొంది దరఖాస్తు చేసుకునుందుకు వెళ్లిన సదరు యాప్ తీసుకోదు.

పేదలకు వరం..

ఈనెల 14వ వరకు ఇళ్లకు దరఖాస్తు పెంచడంతో అర్హులైన పేదలకు వరంగా మారింది. మరింత మంది పేదలు ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లభించింది. ఆయా ప్రాంతాల వారీగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సర్వే చేయడంతో పాటు ఎవరైనా అర్హులైన పేదలుంటే సొంతంగానైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా ఉంది.

అర్హులైన పేదలు వినియోగించుకోండి

అర్హులైన ప్రతి పేదోడికి సొంతిల్లు కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 14వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు పెంచాం. కావున అర్హులైన పేదలు ఎవరైనా ఉంటే సద్వినియోగించుకోండి. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కూడా బాధ్యతగా సర్వే చేసి అర్హులను గుర్తించండి.

● శ్రీహరి గోపాల్, జిల్లా గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జి పీడీ, నంద్యాల

శానిటేషన్‌పై తనిఖీ

- సకాలంలో పన్నులు చెల్లించండి
- రీజనల్ డైరెక్టర్ నాగరాజు

ఆళ్లగడ్డ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అన్ని మున్సిపాలిటీలలో ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను, శానిటేషన్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్నట్లు రీజనల్ డైరెక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్‌పై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ఆకస్మిక తనిఖీ

ఆర్‌డీ నాగరాజు



డంపుయార్డును తనిఖీ చేస్తున్న ఆర్‌డీ నాగరాజు , సిబ్బంది

నంద్యాల టౌన్ డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపాలిటీలోని పలు విభాగాలను అనంతపురం రీజినల్ డైరెక్టర్ నాగరాజు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం సమయంలో నేరుగా మున్సిపాలిటీకి వచ్చి అక్కడ సిబ్బందిని అడిగి పన్నులు, శానిటైజేషన్ విభాగాల్లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో కలిసి పట్టణం లోని టెక్కె 13వ సచివాలయంలో తనిఖీ చేసి ప్రజలకు సకా లంలో సేవలు అందించాలన్నారు. డంపు యార్డుకు వెళ్లి చెత్త నిర్వహణ సరైన పద్ధతిలో చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ఆర్థిక ఏడాదికిగాను ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి దోహదపడాలని అన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎంఈ గురప్పయాదవ్, ఎస్ఎస్ మురళి, లక్ష్మీనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలానికి రివాల్వర్‌తో వచ్చిన ఎస్ఐ



టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీలో విచారిస్తున్న పోలీసులు

శ్రీశైలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు రివాల్వర్‌తో క్షేత్ర ప్రవేశానికి వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన ఎస్ఐని అడ్డుకున్నారు. మంగళవారం ఉదయం 7 గంటలకు ఓ ప్రైవేటు కారులో 9ఎంఎం రివాల్వర్‌తో వచ్చిన అతడిని ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు విచారించారు. తాను మధ్యప్రదేశ్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఉద్యోగిగా ఎస్ఐ హోదాలో ఉన్నట్లు ఐడీ కార్డు చూపించారు. శ్రీశైలంలో ఇటీవల జరిగిన సైబర్ మోసాలకు సంబంధించి ఉభయ తెలుగు రాష్ట్రాలో పలు ప్రాంతాల్లో విచారణ చేస్తున్న అతను క్షేత్ర దర్శనానికి మాత్రమే వచ్చినట్లు సీఐ తెలిపారు.

పకడ్బందీగా వన్యప్రాణులను లెక్కిస్తాం

ఆత్మకూరు ప్రాజెక్ట్ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్



వన్యప్రాణుల లెక్కింపు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆత్మకూరు ప్రాజెక్ట్ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్

ఆత్మకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేట్ - 2026 కార్యక్రమంలో భాగంగా ఫేస్-1 వన్యప్రాణుల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నట్లు ఆత్మకూరు ప్రాజెక్ట్ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆత్మకూరు ప్రాజెక్ట్ పరిధిలో జరుగుతున్న వన్యప్రాణుల లెక్కింపు అంచనాల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు 1 నుంచి 8వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు 178కిమీల అటవీ మార్గాల్లో లెక్కింపు బృందాలు పర్యటించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా వన్యప్రాణులను ప్రత్యక్ష వీక్షణం ద్వారా గుర్తించి వాటి వివరాలను నమోదు చేసుకున్నట్లు చెప్పారు. అలాగే అడవి స్థితిగతులకు సంబంధించిన వివరాలను కూడా సేకరించామని అన్నారు. ఈ క్రమంలోనే బైర్లూటి రేంజ్‌లో ఓ చిరుతను అటవీ సిబ్బంది గమనించినట్లు తెలిపారు. అలాగే ఒక పెద్దపులి పాదముద్రికను, పలు వన్యప్రాణుల మలమూత్రాలను కూడా సేకరించినట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు లెక్కింపు వివరాలను ఎంస్ట్రైప్స్ ఎకలాజికల్ మొబైల్ యాప్‌లో నిక్షిప్తపరుస్తున్నట్లు వెల్లడించారు.

పత్తి పంట దున్నివేత

రూ.3లక్షల నష్టం

రుద్రవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆశలు ఆవిరయ్యాయి. మంచి లాభాలు వస్తాయని పత్తి సాగు చేస్తే నిరాశే మిగిలింది. దీంతో రైతు పత్తి పంటను దున్నేశాడు. మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన ఓబులేసు అనే రైతు ఆలమూరు గ్రామ సమీపంలో సాగు చేసిన పత్తి పంటను మంగళవారం ట్రాక్టరుతో ట్రిల్లరు కొట్టి దున్ని వేశా రు. మూడెకరాల్లో ఎకరాకు రూ. లక్ష చొప్పున రూ. 3 లక్షల నష్టం వాటి ల్లింది. సాగు కోసం చేసిన ఖర్చు కూడా చేతికందక నష్టం వాటిల్లడంతో దున్నివేశానని రైతు తెలిపారు.



ఆలమూరు సమీపంలో పత్తి పంటను ట్రాక్టరుతో దున్నేస్తున్న రైతు

ఆరుతడి పంటలకే ప్రాధాన్యమివ్వండి



మాట్లాడుతున్న మంత్రులు

మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి

నంద్యాల నూనెపల్లె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో వరికి బదులుగా ఆరుతడి పంటలు వేసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన నీటి పారుదల సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ రబీ పంటలకు సాగునీరు అందించే అంశంపై చర్చించిన పిదప ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. కేసీ కెనాల్, ఎస్సార్‌బీసీ, తెలుగుగంగ ఆయకట్టులో ఎంత మేరకు నీరు విడుదల చేయాలనే అంశంపై ఇరిగేషన్ అధికారులతో సమీక్షించామన్నారు. ఎస్ఆర్బీసీ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేసీ కెనాల్ పరిధిలో తుంగభద్ర ప్రాజెక్ట్ గేట్లు కొత్తగా నిర్మించడంతో తాత్కాలిక ఇబ్బందులు ఎదురౌతున్నాయని, అందువల్ల జీరో-120, 120టూ 150 కిలో మీటర్ల వరకు ఈసీజన్‌లో నీటి విడుదల సాధ్యం కాదని ఎమ్మెల్యేలకు సూచించారు. రివర్స్ పంపింగ్ వంటి ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రభుత్వం పరిశీలిస్తుందని మంత్రులు పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ఎస్సార్బీసీ చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం

శ్రీశైలం రైట్‌బ్రాంచ్ కెనాల్ ద్వారా రబీ పంటలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు విడుదల చేసేలా నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వివరించారు. రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. నంద్యాల జిల్లా పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో నీటి పారుదల, ఆరుతడి పంటల ప్రణాళిక ప్రకారం ఆయకట్టుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ, శ్రీశైలం, పాణ్యం, నందికొట్కూర్, పొద్దుటూరు ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గౌరు చరితారెడ్డి, గిత్తా జయసూర్య, వరదరాజులరెడ్డి, జడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, కేసీ కెనాల్ చైర్మన్ రామలింగారెడ్డి, తెలుగుగంగ చైర్మన్ సంజీవకుమార్‌రెడ్డి, ఎస్ఆర్బీసీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవిశ్వాసంలో నెగ్గిన టీడీపీ



అవిశ్వాస తీర్మానంలో పాల్గొన్న ఎంపీటీసీలు

- కర్నూలు ఎంపీపీ పీఠంపై పసుపు జెండా
- త్వరలోనే మండల అధ్యక్షుడి ఎన్నిక
- గైర్హాజరైన ఆరుగురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు
- చక్రం తిప్పిన విష్ణు, బొగ్గుల
- ఇక నుంచి ఎంపీటీసీగా వెంకటేశ్వరమ్మ
- మినిట్స్ బుక్కులో పొందుపరిచిన ఆర్డీవో

కర్నూలు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండల ఎంపీపీపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో ఎట్టకేలకు టీడీపీ నెగ్గింది. దీంతో కర్నూలు ఎంపీపీ పీఠంపై పసుపు జెండా ఎగిరింది. తెలుగు తమ్ముళ్లు, బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. మంగళవారం కర్నూలు ఆర్డీవో కిడారి సందీప్‌కుమార్ అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలోని మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో వైసీపీ ఎంపీపీ వెంకటేశ్వరమ్మపై గతంలో టీడీపీ ఎంపీటీసీలు కలిసి ఇచ్చిన వినతిపత్రం మేరకు ఆర్డీవో అవిశ్వాస తీర్మానం గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కర్నూలు మండలంలో మొత్తం 19మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా ఈ సమావేశానికి 13మంది టీడీపీ ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. మిగిలిన ఆరుగురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. ఈ ప్రత్యేక సమావేశం ఉదయం 11-45 గంటలకు ప్రారంభమై, కర్నూలు మండల ఎంపీపీ వెంకటేశ్వరమ్మపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం కాపీని ఆర్డీవో సభ్యులకు చదివి వినిపించారు. వెంటనే వైసీపీకి చెందిన ప్రసుత ఎంపీపీ వెంకటేశ్వరమ్మ తమకొద్దని, ఆమె ఎన్నికను వ్యతిరేకిస్తున్నట్లు 13 మంది టీడీపీ ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తి ప్రకటించారు. కర్నూలు రూరల్ తహసీల్దార్ వెంకటరమేష్‌బాబు, ఎంపీడీవో రఘునాథ్ కలిసి చేతులెత్తిన సభ్యుల వివరాలను రికార్డుల్లో పొందుపరిచారు. 13మంది ఎంపీటీసీ సభ్యులు కోరిక మేరకు వారి తీర్మానాన్ని ఆమోదిస్తున్నట్లు కర్నూలు ఆర్డీవో ప్రకటించారు. ఇక నుంచి కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ ఉల్చాల గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాత్రమేనని ఆయన తెలిపారు.

మిగతా 5వ పేజీలో

కేసీ కెనాల్ ఈఈని సస్పెండ్ చేయాలి

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



మాట్లాడుతున్న భూమా అఖిల ప్రియ

నంద్యాల రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ ఈఈ, తెలుగుగంగ ఇన్‌చార్జి ఎస్ఈ ప్రతాప్‌ను సస్పెండ్ చేయాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన నీటిపారుదల సలహామండలి సమావేశంలో అధికారులు వ్యవహరించిన తీరుపై ఆమె మండిపడ్డారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని కేసీ కెనాల్, తెలుగుగంగ మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కింద సాగు చేస్తున్న పంటలకు రబీలో నీరు ఇవ్వమని చెప్పడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈఈ ప్రతాప్‌కు నీటిపారుదలపై అవగాహన లేకపోవడం బాధగా ఉందన్నారు. నీరు తగినంత ఉన్నప్పటికీ ఆళ్లగడ్డపై కక్ష సాధింపు ధోరణిలో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీశైలం నుంచి నీరు ఇవ్వడానికి ఈఈ ప్రతాప్ సీఎం నుంచి అనుమతి రావాలని చెప్పడం రైతులను రెచ్చగొట్టడమేనని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారుల తీరుపై సీఎం, విద్యాశాఖ, ఇరిగేషన్ శాఖ మంత్రులకు ఫిర్యాదుచేస్తామని తెలిపారు. సమావేశంలో రాంభూపాల్ రెడ్డి, తెలుగు గంగ ప్రాజెక్టు చైర్మన్ కుమార్‌రెడ్డి, ఆళ్లగడ్డ తెలుగు గంగ, కేసీ కెనాల్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

శిథిల భవనం



ఈ భవనం ఎప్పుడైనా కూలొచ్చు..

కర్నూలు కలెక్టరేట్ ప్రాంగణంలో దాదాపు 40శాఖలు ఉన్నాయి. వీటిలో శ్రీశైలం ప్రాజెక్టు సంబంధించిన భవనం శిథిలావస్థకు చేరింది. ఈ భవనం నిర్మించి 42 సంవత్సరాలు కావస్తోంది. నాటి నుంచి నేటి వరకు అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. ప్రభుత్వ రికార్డులకు కూడా భద్రత లేకుండా పోయింది. వర్షం పడితే ఆ భవనం చిత్తడే. భవనం ఎప్పుడు కూలుతుం దోననే పరిస్థితి నెలకొంది. అక్కడ పనిచేసే ఉద్యోగులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి రికార్డులు కూడా భద్రపరుచుకోలేని నిర్లక్ష్య స్థితిలో అధికారులు ఉన్నారు.

● కర్నూలు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి



విలువైన డాక్యుమెంట్లు, రికార్డులు ఉన్న గది ఇలా





గోడలు కూలిపోయి శిథిలావస్థలో దర్శనమిస్తున్న కార్యాలయం..

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు కుమార్ యాదవ్

● ప్రసంగించడానికి ఎంపికైన ఉపాధ్యాయుడు



బనగానపల్లె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక ఇండియా ఇంటర్నేషనల్ సైన్సు ఫెస్టివల్‌లో (ఐఐఎస్ఎఫ్) ప్రసంగించడానికి టీచర్ వీరబోయిన కుమార్‌యాదవ్ ఎంపికయ్యారు. నంద్యాల జిల్లాలోని బనగానపల్లె మండలం నందవరం జడ్పీహెచ్ఎస్ టీచర్ కుమార్‌యాదవ్ ఒకేసారి రెండు విభాగాలకు ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని చెప్పవచ్చు. డిసెంబరు 5 నుంచి 9 వరకు చండీగఢ్‌లో ఇండియా ఇంటర్నేషనల్ సైన్సు ఫెస్టివల్ 2025లో జరుగనుంది. గత సంవత్సర గువహటిలో జరిగిన సైన్సు ఫెస్టివల్‌లోనూ ఉపాధ్యాయుడు కుమార్‌యాద్ పాల్గొని ప్రసంగించారు. ఈసారి కూడా జాతీయ వేదికపై ఆయన పాల్గొనడం ఆయన ప్రతిభకు నిదర్శనం. రాయలసీమ రీజనల్ పర్యావరణ సమన్వయ కర్తగా, రాష్ట్ర కౌశల్ కోఆర్డినేటర్‌గా, జిల్లా బాలల సైన్సు కాంగ్రెస్ ఆఫీసర్, జిల్లా పర్యావరణ కర్తగా ఆయన సేవలందించారు. పర్యావరణంపై పుస్తకాలు, శాస్త్రీయ కథనాలు రాసి గ్రామీణ విద్యార్థులకు శాస్త్రాన్ని సులభంగా చేరవేసే ఉపాధ్యాయుల్లో ఆయన ముందుంటారు. ఇండియన్ సైన్సు కాంగ్రెస్, నేషనల్ టీచర్స్ సైన్సు కాంగ్రెస్ వంటి వేదికలపై అనేక పరిశోధనా పత్రాలు సమర్పించి నిపుణుల ప్రశంసలు అందుకున్నారు. కుమార్‌బాబు మార్గదర్శకత్వంలో గ్రామీణ విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో అనేక విజయాలు సాధించారు. మాతృభాషలో సైన్సు లిటరేచర్ అందించడం ద్వారా విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనలు పెంపొందించాలనే లక్ష్యంతో ఈ వేదికపై ప్రసంగించనున్నారు. జిల్లా విద్యాశాఖ, ఉపాధ్యాయ వర్గం, స్థానిక ప్రతినిధులు కుమార్‌యాదవ్‌కు అభినందనలు తెలిపారు.

టార్పాలిన్ల తంటాలు

● వర్షాలకు నష్టపోతున్న పంట ఉత్పత్తులు
● రైతులకు తప్పని ఎదురు చూపులు



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు అవసరమైనని టార్పాలిన్లు లేక రైతులు తంటాలు పడుతున్నారు. రైతులను ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో సాగుచేసిన పంటలను భారీవర్షాలు, తుఫాన్లు ముంచెత్తుతున్నాయి. చేతికందిన పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ఉమ్మడి జిల్లాలో తుఫాన్‌లు, విపత్తులు గత ఖరీఫ్‌లో అన్నదాతల వెన్ను విరిచాయి. ప్రస్తుత రబీలోనూ వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంట చేతికందే సమయంలో వర్షాలతోనే తమ బతుకులు తెల్లారుతున్నాయని రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఇటీవల సంభవించిన 'మొంథా'తో పాటు తాజాగా దిత్వా తుఫాన్ రైతులను బెంబేలెత్తిస్తోంది. గత మూడు రోజులుగా ఎండనేది లేకుండా రైతులు పంట ఉత్పత్తులు వర్షానికి ఎక్కడా తడిసిపోతాయోనని రాత్రింబవళ్లు కళ్లలో ఒత్తులు పెట్టుకుని పొలాలు, కల్లాల వద్దే కూర్చోవాల్సిన పరిస్థితి దాపురించింది. గత వైసీపీ ప్రభుత్వం అన్నదాతల సంక్షేమాన్ని గాలికొదిలేసింది. 2014 నుంచి 2019 వరకు రాయితీ పై టార్పాలిన్ల పంపిణీని అటకెక్కించేసింది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లను అందించారు.

కంటి మీద కునుకు లేకుండా

ప్రస్తుతం కర్నూలు జిల్లాలో పత్తితీతలు జోరుగా సాగుతున్నాయి. సీసీఐ కేంద్రాల్లో ఇప్పుడిప్పుడే పత్తి అమ్మకాలు పుంజుకుంటున్నాయి. కర్నూలు జిల్లాలో 11 కేంద్రాల్లో, నంద్యాలలో ఒక కేంద్రంలో అధికారులు రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఈ కేంద్రాలకు రైతులు పత్తి తరలించేందుకు ఉన్న ఫలంగా వచ్చి పడుతున్న తుఫాన్లు, వర్షాలు వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సీసీఐ అధికారులు 8 నుంచి 12 శాతం లోపే తేమ ఉండాలని ఆంక్షలు పెట్టింది. వారు పెట్టిన నిబంధనలను అనుసరించేందుకు రైతులకు ప్రస్తుత వర్షాలకు దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతుంది. ఇప్పటికైనా తమకు టార్పాలిన్లను అందించాలని మొర పెట్టుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

నూర్పిళ్ల సమయంలో..

ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ప్రస్తుతం కోత దశకు చేరింది. నూర్పిళ్ల సమయంలో వర్షాలు కురిస్తే.. ధాన్యాన్ని కాపాడుకోవడం తమ చేతకావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.10వేలు విలువ చేసే శిల్పాలిష్ టార్పాలిన్లను రాయితీపై రూ.5వేలకు అందించారు. రూ.2,500కు విలువ చేసే నల్ల టార్పాలిన్ల పట్టాను రూ.1250కు అందజేశారు. రైతుల పొలం విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో రైతుకు రెండు, మూడు టార్పాలిన్లను అందించారు. కొన్నేళ్లుగా రాయితీపై టార్పాలిన్ల పంపిణీని ప్రభుత్వాలు అటకెక్కించడంతో వర్షాల నుంచి పంట ఉత్పత్తులను కాపాడుకోవడానికి రైతులే వాటిని సొంతగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. వ్యవసాయాధికారులను టార్పాలిన్లు ఎప్పుడు పంపిణీ చేస్తారని అడిగితే.. ప్రభుత్వం టార్పాలిన్ల పంపిణీకి ఇంకా ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదని చెబుతున్నారు.

శాస్త్రీయ సంగీతానికి విశ్వఖ్యాతి

శ్రీశైలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో మన శాస్త్రీయ సంగీతం ప్రత్యేక గుర్తింపు, ఖ్యాతి దక్కించుకుందనికేంద్ర ప్రభుత్వ టూరిజం శాఖ హైదరాబాద్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కృపాకర్ రావిపాటి అన్నారు. శ్రీశైల క్షేత్రానికి వచ్చే యాత్రికులకు భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం, ఆధ్యాత్మిక పర్యాటకంతో కళలను అనుసంధానించడంపై పలు విషయాలను వివరించారు. మంగళవారం సాయంత్రం ఆలయ దక్షిణ మాడవీధిలో ధర్మపథం వేదికపై బెంగళూ రుకు చెందిన కృష్ణవేణి సంగీత నీరాజనోత్సవం జరిగింది. కర్ణాటక సంగీత గాత్ర కచేరిలో విదూషి అంజలి, శ్రీరామ్‌లు కీర్తనలు ఆలపించగా విద్వాన్ అచ్యుతరావు వయోలీన్, విదూషి రంజని, వెంకటేష్ మృదంగ సహకారం అందించారు. ఈ కార్య క్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, ఈఓ శ్రీనివాసరావు, టూరిజంశాఖ డివిజనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపికను తీసుకుంటున్న కృపాకర్ రావిపాటి

కర్నూలు జీజీహెచ్‌కు రెండు స్టేట్ అవార్డులు

● బెస్ట్ బ్లడ్ బ్యాంకు, ఉత్తమ ఐసీటీసీ సెంటర్లుగా అవార్డుల స్వీకరణ

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్)కు రెండు స్టేట్ ఫస్ట్ అవార్డులు వచ్చినట్లు హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ బ్లడ్ బ్యాంకు కు రాష్ట్రంలోనే అత్యధికంగా రక్తం యూనిట్లను కలెక్ట్ చేసినందుకు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం లభించగా విజయవాడలో అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది 11,531 బ్లడ్ యూనిట్లను సేకరించడంతో రాష్ట్ర స్థాయిలో మొదటిస్థానంలో నిలిచిందన్నారు. బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్లు సుధీర్, రసూల్, కిరణ్ కుమార్, రంగస్వామిని అభినందించారు. జీజీహెచ్ మైక్రోబయాలజీ విభాగం పరిధిలో పనిచేస్తున్న ఐసీటీసీ సెంటర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవల అవార్డు అందుకుంది. హెచ్ఐవీ స్క్రీనింగ్ సేవలు, కౌన్సిలింగ్ నాణ్యత, డేటా మేనేజ్‌మెంట్ రోగుల సేవలో చూపుతున్న పనితీరుకు గుర్తింపుగా పురస్కారం ప్రదానం చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ నాగజ్యోతి, ఐసీటీసీ ఇన్‌చార్జి డాక్టర్ శరణ్య, కౌన్సిలర్స్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.




బెస్ట్ బ్లడ్ బ్యాంకు అవార్డుతో సూపరింటెండెంట్, వైద్యులు

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.



కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను

\- సంయుక్త



'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహరాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2 టికెట్ ధరల పెంపు

\- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గేట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాధరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే



రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్గియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ

రణ్‌వీర్ క్షమాపణలు



కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

అవిశ్వాసంలో నెగ్గిన టీడీపీ



ఎంపీటీసీలతో ఎమ్మెల్యే, కేడీసీసీబీ చైర్మన్

(3వ పేజీ తరువాయి)

మొత్తం 19మంది ఎంపీటీసీ సభ్యుల్లో ఆరుగురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు హాజరుకానందున సమావేశంలో ఉన్నవారిలో రెండు బై మూడో వంతు ప్రకారం 13మంది ఎంపీటీసీలతో కోరం సంపూర్ణంగా ఉన్నట్లు వివరించారు. 13మంది సభ్యుల తీర్మానాన్ని ఆమోదిస్తూ పంచాయతీ మినిట్స్ బుక్కులో ఆర్డీవో నమోదు చేశారు. రెండో పట్టణ పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

త్వరలోనే కొత్త ఎంపీపీ ఎన్నిక

ఉల్చాల ఎంపీటీసీ సభ్యురాలు డి. వెంకటేశ్వమ్మకు ఎంపీపీ పదవిని రద్దు చేసినట్లు ఆర్డీవో తెలిపారు. అవిశ్వాస తీర్మానంలో మెజార్టీ సభ్యులు ఆమెను వ్యతిరేకించారని వివరించారు. ఈ తీర్మానం కాపీని జడ్పీ సీఈవో, కలెక్టర్‌కు పంపనున్నారు. అక్కడ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపి ఆయన పరిశీలించిన అనంతరం ప్రిన్సిపల్ అనుమతితో కొత్త ఎంపీపీ ఎన్నికకు గడువును నిర్ణయిస్తారు. కాగా మండల అధ్యక్షుడి ఎవరనేది ఉత్కంఠత నెలకొంది. కర్నూలు మండలంలో చాలా మంది ఎంపీపీ పదవి కోసం ఆసక్తి చూపుతున్నారు. కోడుమూరు ఎమ్మెల్యే, కేడీసీసీబీ చైర్మన్ ఎంపీపీ పదవి ఎవరికి కేటాయించాలో స్పష్టత లేదు. ఇప్పటికే కొంతమంది ఎంపీటీసీ సభ్యులు తనకే మాటిచ్చారంటూ ప్రచారం చేసుకుంటున్నారు. కేవలం మరో 8నెలలే ఈ పదవీ కాలం ఉంది. .

చక్రం తిప్పిన విష్ణు, ఎమ్మెల్యే బొగ్గుల

కర్నూలు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానంలో కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బొగ్గుల చక్రం తిప్పారు. 2021 ఎంపీపీ ఎన్నికను దృష్టిలో పెట్టుకొని ఈసారి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లి పట్టు సాధించారు. అవిశ్వాస తీర్మాన విషయంలో కర్నూలు మండలంలో మొదటిస్థానంలో నిలిచింది. అనంతరం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మీడియాతో మాట్లాడారు. ఎంపీపీ స్థానం టీడీపీ కైవసం చేసుకో వడం సంతోషకరమని అన్నారు. ఈ క్రెడిట్ విష్ణువర్ధన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు.

నిందితుల అరెస్టు

- 1,250 గ్రాముల గంజాయి స్వాధీనం

డోన్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయం చేస్తున్నట్లు సమాచారం మేరకు మంగళవారం రాత్రి రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1,250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా నిందితుల వివరాలు వెల్లడించారు. ఏ1 నిందితుడుగా డోన్ కొత్తపేటకు చెందిన ఈడిగ ఈశ్వర్‌గౌడు అలియాస్ గాలిగాడు, ఏ2 డోన్ పాతపేటకు చెందిన షేక్ హుస్సేన్ అలియాస్ హుసన్‌వలీ అలియాస్ హుసన్ బాయ్, ఏ3గా కొండపేటకు చెందిన చాకలి హరికృష్ణ అలియాస్ గుండులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, సిబ్బంది నాగరాజు, సీతారామయ్య, రాము పాల్గొన్నారు

నంద్యాలలో ఇద్దరి దారుణ హత్య

- ఘాతుకానికి దారి తీసిన దంపతుల మధ్య గొడవ
- ఘటనా స్థలిలోనే ఒకరు.. చికిత్స పొందుతూ మరొకరు మృతి

నంద్యాల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రంలో ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు. దంపతుల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ జంట హత్యకు దారి తీసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా... నంద్యాల పట్టణంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఓ ఘర్షణలో ఓ యువకుడు దారుణ హత్యకు గురికాగా మరో వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన హరిజనపేటలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. నంద్యాల పట్టణంలోని హరిజనపేటకు చెందిన పెద్దన్న(26), మధు అన్నదమ్ములు. వీరిలో పెద్దన్న స్థానికంగా ప్రభుత్వాస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతడి డో అన్న మధు అదే కాలనీకి చెందిన మహాలక్ష్మి అనే యువతిని ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం దంపతులు మధు, మహాలక్ష్మి ఇంట్లో గొడవ పడ్డారు. ఆ సమయంలో మధు తల్లి లక్ష్మీదేవిని వారు తోసేసారు. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది. స్థానికులు ఆమెను ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడే పనిచేస్తున్న పెద్దన్న తల్లి బాగోగులు చూసుకుని రాత్రి ఇంటికి వెళ్లాడు. గొడవ అనంతరం మహాలక్ష్మి అదే కాలనీలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. తల్లిని కిందకు తోసేశారన్న కోపంతో పెద్దన్న స్నేహితుడు చాకలి సురేశ్(25)తో కలసి.. వదిన మహాలక్ష్మి ఇంటికి వెళ్లాడు. 'మా అమ్మను ఎందుకు కొట్టారు. వృద్ధురాలిపై చేయి చేసుకోవడం ఏమిటి..' అంటూ వదినపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ వివాదంతో విసిగిపోయిన మహాలక్ష్మి తమ్ముడు రాజ్‌కుమార్ ఆగ్రహంతో ఊగిపోయాడు. ఇంట్లో ఉన్న కత్తి తీసుకుని పెద్దన్నపై దాడికి పాల్పడ్డాడు. విచక్షణా రహితంగా కత్తితో పొడిచి హతమార్చాడు. ఇదే సమయంలో దాడిని అడ్డుకోబోయిన స్నేహితుడు చాకలి సురేశ్‌ను కూడా కత్తితో పొడిచాడు. స్థానికులు గమనించి కొన ఊపిరితో ఉన్న సురేశ్‌ను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే మంగళవారం మధ్యాహ్నం సురేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హత్య అనంతరం నిందితుడు రాజ్‌కుమార్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు రాజ్‌కుమార్‌తో పాటు, ఆయన తల్లిదండ్రులు లక్ష్మయ్య, సరస్వతి, సోదరి మహాలక్ష్మిపై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా మృతుడి బంధువులు ఆగ్రహావేశాలు తట్టుకోలేక రాజ్‌కుమార్ ఇంటిపైకి దాడికి దిగారు. అక్కడ నిందితుడు రాజ్‌కుమార్ ద్విచక్రవాహనాన్ని దహనం చేశారు. నంద్యాల వన్‌టౌన్ పోలీసులు, ఇన్‌చార్జి సీఐ అస్రార్ బాషా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.



కొమ్ము పెద్దన, చాకలి సురేశ్ (ఫైల్)

అనవసర వివాదంలోకి వెళ్లి మృతి...

నంద్యాల పట్టణంలోని ఉప్పరిపేటకు చెందిన మంగయ్య, ఉమాదేవి దంపతుల కుమారుడు సురేశ్ (25) అనవసర వివాదంలోకి వెళ్లి హత్యకు గురయ్యాడు. సెక్యూరిటీ గార్డు పెద్దన్న, సురేశ్‌లు కొన్నేళ్లుగా స్నేహితులు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో పెద్దన్న ఉప్పరిపేటకు వెళ్లి పని ఉందని సురేశ్‌ను వెంటపెట్టుకుని వెళ్లాడు. స్నేహితుడు కావడంతో భోజనం చేసి నిద్రించాల్సిన సురేష్ పెద్దన్నతో పాటు బైక్‌లో కలసి వెళ్లాడు. అక్కడ మహాలక్ష్మి పుట్టింటి వద్ద జరిగిన ఘర్షణలో అన్యాయంగా సురేశ్ బలయ్యాడు. స్నేహితుడిని రక్షించే క్రమంలో కత్తిపోట్లకు గురయ్యాడు. అడ్డు వచ్చిన సురేశ్‌పై నిందితుడు రాజ్‌కుమార్ కత్తితో కడుపులో పొడిచాడు. దీంతో ఆయన పేగులు బయటకు వచ్చాయి. ఘటన అనంతరం వైద్యులు ఆపరేషన్ చేసినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

పెండింగ్‌లో గౌరవ వేతనం

- ఆరు నెలలుగా అతిథి అధ్యాపకుల ఆవేదన
- జిల్లాలో 50 మంది గెస్టు ఫ్యాకల్టీ



నగరంలోని ప్రభుత్వ మైనార్టీ జూనియర్ కళాశాల

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేసే అతిథి అధ్యాపకులు (గెస్టు ఫ్యాకల్టీ)కి గౌరవ వేతనాలు ఇవ్వడం లేదు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. దీంతో అతిథి అధ్యాపకులు ఆర్థిక ఇబ్బందులతో బోధనపై దృష్టి పెట్టలేక సతమతమవుతున్నారు. కర్నూలు జిల్లాలో 23 జూనియర్ కళాశాలలో మొత్తం 50 మంది అతిథి అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరికి నెలకు రూ.27వేల గౌరవ వేతనం ప్రభుత్వం ఇస్తోంది. కొందరు గెస్టు అధ్యాపకులకు జూన్, జూలై నెలల గౌరవ వేతనం విడుదల చేసింది. మరి కొందరికి జూన్ నెల నుంచి వేతనం ఇవ్వడం లేదు. కళాశాలలో విద్యార్థులకు బోధనతో పాటు కుటుంబాలను పోషించుకోలేక ఆందోళన చెందుతున్నారు. అప్పులు తెచ్చి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైసీపీ పాలనలో 2020-21, 2021-22 విద్యా సంవత్సరాలకు సంబంధించి గెస్టు ఫ్యాకల్టీకి గౌరవ వేతనం చెల్లించలేదు. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం చెల్లించాలని పలుమార్లు ఇంటర్ బోర్డు కమిషనర్ సెక్రటరీని కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం కనిపించడం లేదు.



పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్టు ఫ్యాకల్టీకి పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం చెల్లించాలి. ఈ విద్యాసంవత్సరం జూన్ నుంచి గౌరవ వేతనం ఇవ్వడం లేదు. **-సలావుద్దీన్, ఏపీజీజేసీ, గెస్టు ఫ్యాకల్టీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు (జువాలజీ ఫ్యాకల్టీ, కర్నూలు మైనార్టీ జూనియర్ కళాశాల)**



రెగ్యులర్ జీతాలతోపాటు ఇవ్వాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న గెస్టు ఫ్యాకల్టీకి రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ప్రతి నెలా ఒకటో తేదీన గౌరవ వేతనం చెల్లించాలి. జీతం అందకపోవడంతో కుటుంబాల పోషణ భారంగా మారింది. **- మున్వర్ సుల్తానా, గెస్టు ఫ్యాకల్టీ, సివిక్స్, కర్నూలు ప్రభుత్వ మైనార్టీ (ఉర్దూ) జూనియర్ కళాశాల**

ప్రాణం తీసిన ఓవర్ టేక్

- అదుపు తప్పిన బైక్
- టిప్పర్ కిందపడి ఇద్దరి మృతి
- సంతోష్ నగర్ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం



ఆసుపత్రిలో రోదిస్తున్న సుమన్ బంధువులు



సుమన్, చంద్రమోహన్ (ఫైల్)

కర్నూలు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగర శివారులో సంతోష్ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రమోహన్(29), సుమన్(28) అనే వ్యక్తులు దుర్మరణం చెందారు. మరో యువకుడు నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. హైదరాబాదు వైపు నుంచి నవీన్, చంద్రమోహన్, సుమన్ పల్సర్ బైక్‌పై కర్నూలు వస్తున్నారు. ముందు వెళుతున్న టిప్పర్‌ను ఓవర్‌టెక్ చేసే ప్రయత్నంలో అదుపు తప్పి కింద పడ్డారు. టిప్పర్ వీరిని ఢీ కొట్టడంతో చంద్రమోహన్, సుమన్ అక్కడికక్కడే మృతి చెందాడు. నవీన్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన నవీన్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. సుమన్ తలపై టిప్పర్ ఎక్కడంతో తల నుజ్జునుజ్జయింది. ట్రాఫిక్ పోలీసులు చేరుకుని, సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

మృతులు ఇద్దరిదీ గూడూరు..

మృతి చెందిన చంద్రమోహన్, సుమన్ ఇద్దరు గూడూరు వాసులే. సుమన్ కర్నూలులోని ఇందిరాగాంధీ నగర్‌లో నివాసముంటూ అమీలియో ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. ఇతనికి భార్య మౌనిక, ఇద్దరు కొడుకులు ఉన్నారు. చంద్రమోహన్ గూడూరులో నివాసముంటున్నాడు. ఈయనకు భార్య మౌనిక ఉంది. చంద్రమోహన్ మేనత్త కొడుకు ఎమ్మిగనూరు చెందిన నవీన్ ఆదివారం గూడూరు వచ్చాడు. నవీన్, చంద్రమోహన్ కలిసి మంగళవారం సాయంత్రం కర్నూలు వచ్చి సుమన్‌ను పిలుచుకుని హైదరాబాదు వైపు పనిమీద వెళ్లారు. తిరిగి వస్తుండగా.. ఈ ప్రమాదం చోటుచేసుకుంది.



ఒకరిని కాపాడిన ఆటో డ్రైవర్ సురేష్

ప్రమాద సమయంలో సంతోష్‌నగర్ వైపు వెళ్తున్న ఆటో డ్రైవర్ సురేష్ ప్రమాదాన్ని గమనించి, ఆటోను సంతోష్‌నగర్ క్రాస్ వద్ద యూటర్న్ చేసుకుని ప్రమాద స్థలం వద్దకు వచ్చాడు. ఆ సమయంలో నవీన్, చంద్రమోహన్ కొన ఊపిరితో ఉన్నారు. కొందరు సెల్‌ఫోన్లలో వీడియో తీస్తున్నారే తప్ప, ఎవరు సాయం చేయలేదు. ఆటో డ్రైవర్ సురేష్ స్పందించి ప్రాణాలతో ఉన్న నవీన్‌ను ఓ వాహనంలో ఆసుపత్రికి తరలించారు. సరైన సమయంలో ఆసుపత్రికి తరలించడంతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. స్పందించిన సురేష్‌ను ట్రాఫిక్ సీఐ అభినందించారు.

అనుమతుల్లేని లాడ్జీలను కూల్చేస్తాం

- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

మంత్రాలయం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో అనుమతి లేకుండా నిర్మించిన లాడ్జీలు, హోంస్టేలను కూల్చేస్తామని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మంత్రాలయంలో అక్రమంగా నిర్మించిన హోంస్టేలు, లాడ్జీలపై అకస్మికంగా ఆయన తనిఖీ చేశారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో నాయకుల ప్రమేయంతో అనుమతులు లేకుండా లాడ్జీలు నిర్మించుకున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అక్రమమైనవి సక్రమంగా చేసుకేందుకు అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. రామచంద్రనగర్‌లో ఇంటి అనుమతులు తీసుకుని హోంస్టేలుగా మార్చి భక్తుల నుంచి వేలల్లో దోచుకుంటున్నారన్నారు. కుడా అనుమతులు తీసుకోడానికి నెల గడువులో నోటీసులిచ్చి, యజమానులు స్పందించకపోతే నీరు, విద్యుత్ నిలుపుదలచేసి ఆపై కూల్చేస్తామన్నారు. పార్కింగ్‌కు స్థలాలు, అగ్నిమాపక ఏర్పాట్లు లేకుండా లాడ్జీలు, హోంస్టేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట మంత్రాలయం గ్రామ కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, రాజు, వరదరాజు, ఎంపీటీసీ మేకల వెంకటేష్, రాజు, రాగన్న ఉన్నారు.



హోంస్టేలను పరిశీలిస్తున్న సోమిశెట్టి

మహిళపై దాడి కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

కర్నూలు లీగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక గణేష్ నగర్‌లో ఓ ఫిర్యాదిపై దాడిచేసి దుర్భాషలాడిన కేసులో ఇద్దరు నిందితులకు ఏడాది కారాగారశిక్షతో పాటు జరిమానా విధిస్తూ కర్నూలు ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ అనిల్ కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. స్థానిక గణేష్ నగర్‌కు చెందిన రెండో నిందితుడు వెంకటస్వామి ఫిర్యాది అయిన గణేష్ నగర్‌కు చెందిన ఉప్పరి లక్ష్మీదేవికి తనకు పలుకుబడి ఉందని బ్యాంకు లోను ఇప్పిస్తామని చెప్పి రూ.70వేలు తీసుకున్నాడు. తర్వాత లోన్ రాకపోవడంతో ఫిర్యాది అయిన ఉప్పరి లక్ష్మీదేవి 2018 మే 23వ తేదీన వెంకటస్వామి చెల్లెలు మొదటి నిందితురాలు పిడతల లక్ష్మీదేవిని ప్రశ్నించింది. దీంతో ఆమె తన అన్న అయిన రెండో నిందితుడు వెంకటస్వామికి ఫోన్ చేసి పిలిపించుకుంది. అనంతరం ఇద్దరు నిందితులు పిడతల లక్ష్మీదేవి, వెంకటస్వామి ఉప్పరి లక్ష్మీదేవిపై దాడి చేసి దుర్భాషలాడారు. ఫిర్యాది ఉప్పరి లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు మూడో పట్టణ పోలీసులు ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితులపై నేరం రుజువు కావడంతో మొదటి నిందితురాలికి ఏడాది కారాగార శిక్షతో పాటు వివిధ సెక్షన్ల కింద మొత్తం రూ.13వేలు జరిమానా విధించారు. రెండో నిందితునికి ఏడాది కారాగారశిక్షతో పాటు వివిధ సెక్షన్ల కింద 11వేల జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ గోపాలకృష్ణ వాదించారు.

పార్ట్ టైం టీచర్ల నియామకం ఎప్పుడో..?

- ఖాళీ పోస్టుల భర్తీపై దృష్టి సారించని విద్యాశాఖ



ఆలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష పరిధిలో ఉన్న మోడల్ హాస్టల్‌లో వార్డెన్‌లకు 24 గంటల విధుల నుంచి మినహాయింపు ఇచ్చేందుకు రాష్ట్ర విద్యాశాఖ గత ఏడాది నవంబర్‌లో పార్ట్ టైం టీచర్ల నియామకానికి చర్యలు చేపట్టింది. అయితే కొందరు విధుల్లో చేరి పని గంటలు ఎక్కువగా ఉండడం వల్ల ఉద్యోగం వదిలేసి వెళ్లిపోయారు. జిల్లాలో 16 హాస్టళ్లు ఉండగా అందులో 9 హాస్టళ్లకు పార్ట్ టైం టీచర్స్ లేకపోవడంతో పరిస్థితి మొదటికొచ్చింది. తిరిగి ఆ పోస్టులను మెరిట్ జాబితాలో తదుపరి పేర్లు ఉన్న వారితో ఆ పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే ఆ ప్రక్రియ జరగకపోవడంతో జిల్లాలోని ఆస్పరి మండలం పుటకలమర్రి, గూడూరు మండలం జులేకల్, కోసిగి, పెద్దకడబూరు, కృష్ణగిరి, కోడుమూరు, ఎమ్మిగనూరు మండలం కడివెల్ల, మద్దికెర, మంత్రాలయం హాస్టళ్లకు పార్ట్ టైం టీచర్స్ నియామకం నిలిచిపోవడంతో విద్యార్థినులకు స్టడీ అవర్స్, సబ్జెక్టులు బోధించే వారు కరువయ్యారు. మరో 4 నెలల్లో పది, ఇంటర్ పరీక్షలు ఆరంభం కానుండడంతో ఫలితాలపై ప్రభావం పడనుంది. గత ఏడాది పార్ట్ టైం టీచర్స్‌ను నియమించి జాబ్‌చార్ట్ విడుదల చేశారు. ఒక వారం వార్డెన్ పగలు డ్యూటీ, ఒక వారం రాత్రి డ్యూటీ నిర్వహించాలని జాబ్ చార్ట్‌లో నిబంధనలు విధించారు. పార్ట్ టైం టీచర్స్ నియామకం జరగని హాస్టళ్లలో వార్డెన్‌లు 24 గంటలు విధులు నిర్వహించలేక రాజీనామాలకు సిద్ధమవుతున్నారు.

కేజీబీవీలో ఇదే పరిస్థితి..

హొళగుంద, మద్దికెర, హాలహర్వి మండలాల్లో సీఆర్టీ పోస్టులు ఖాళీగా ఉన్నా అధికారులు భర్తీ చేయకపోవడంతో పోస్టులు అలాగే మిగిలిపోయాయి. సబ్జెక్టు బోధించే వారు లేక విద్యార్థినిలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి పార్ట్ టైం టీచర్ల నియామకానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కొత్త నోటిఫికేషన్ రావాల్సి ఉంది...

ఖాళీ పోస్టుల భర్తీకి స్టేట్ ఆఫీసు నుంచి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. జిల్లాల్లో 9 హాస్టళ్లకు పార్ట్ టైం టీచర్స్ నియామకం జరగాల్సి ఉంది. డైలీ వేజెస్ విధానంలో నియమించే విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. **- స్నేహలత, జీసీడీవో, సమగ్రశిక్ష, కర్నూలు**

సీసీ టీవీ ఫుటేజ్ తీసుకురండి

- రాష్ట్రంలోని జిన్నర్లకు సీసీఐ నోటీసులు
- 30 కొనుగోలు కేంద్రాల మిల్లులకు ఆదేశాలు

గుంటూరు సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన జిన్నింగ్ మిల్లుల యజమానులకు సీసీఐ సంచలన నోటీసులు జారీ చేసింది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన జిన్నింగ్ మిల్లుల సీసీ టీవీ ఫుటేజ్ తీసుకురావాలని మంగళవారం నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోలు చేసేందుకు సీసీఐ ఈ ఏడాది 30 కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 పేరుతో జిన్నింగ్ మిల్లులను విభజించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు నోటిఫై చేశారు. ఆయా కేంద్రాలు అన్నీ సీసీఐ లెక్కల ప్రకారం ఈ ఏడాది అక్టోబరు 29వ తేదీ నుంచి ప్రభుత్వం ఆధీనంలోకి వచ్చినట్లుగానే భావించాల్సి ఉంది. అక్టోబరు 29వ తేదీ నుంచి ఆయా జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీ టీవీల ఫుటేజ్ తీసుకురావాలని సీసీఐ అధికారులు నోటీసులు జారీ చేశారు. గత ఏడాది సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు, జిన్నింగ్ మిల్లుల్లో సుమారు రూ. 140 కోట్లు పక్క దారి పట్టాయని సీఐడీకి ఫిర్యాదులు వెళ్లిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజ్ తమకు ఇవ్వాలని సీఐడీ అధికారులు సీసీఐని ఆదేశించారు. అందుకోసం సీసీఐ ఈ తాజా నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక

ఆలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి రాధిక అన్నారు. మంగళవారం రాత్రి ఆలూరు పట్టణంలోని ఎస్సీ బాలికల బాలుర సంక్షేమ హాస్టళ్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని నేరుగా విద్యార్థులనే అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని వార్డెన్ మహమ్మద్ అలీని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారి రాధిక

ఐఏఎస్ అధికారి కూతురి అంత్యక్రియలు

- నివాళి అర్పించిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జవహర్



నివాళి అర్పిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జవహర్

బేతంచెర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గానిపల్లె తండా గ్రామానికి చెందిన ఐఏఎస్ అధికారి చిన్నరాముడు కూతురు మాధురి సాహితిబాయి అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు ఏపీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జవహర్ హాజరై మాధురి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలో ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు, ప్రవీణ్ కుమార్, మంజునాథ్ రెడ్డి సమక్షంలో ఎస్ఐలు రమేష్‌బాబు, తిరుపాలు, బనగానపల్లె ఎస్ఐలు దుగ్గిరెడ్డి, కల్పన పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మెగా పీటీఎంను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 5న నిర్వహించనున్న మెగా తల్లి దండ్రులు- ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని అధికారులందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. మంగళవారం ఆమె తమ చాంబర్‌లో మెగా పీటీఎంపై సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరు 5న అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలలో పీటీఎం నిర్వహించాలన్నారు. ఎంఈవోలు ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు రమ్మని ఆహ్వానించాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు, ఆర్డీవో, అధికారులు హాజరుకావాలన్నారు.

వైభవంగా అష్టదళ పాదపద్మారాధన

నంద్యాల కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలోని కాళికాంబ అమ్మవారికి, సంజీవనగర్ రామాలయంలోని వేంకటేశ్వరస్వామికి మంగళవారం మార్గశిరమాసం ద్వాదశి పురస్కరించుకొని సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 108 వెండి పుష్పాలతో కాళికాంబ అమ్మవారికి, వేంకటేశ్వరస్వామికి అష్టాదళ పాదపద్మారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీనారాయణ, భగవత్‌సేవాసమాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

గడివేముల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సిబ్బంది హుండీ లెక్కించారు. తొమ్మిది నెలలలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.1,65,888 ఆదాయం వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ పాల్గొన్నారు.

వేతన సవరణ కమిషన్‌ను నియమించాలి

గడివేముల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్సీ కాలపరిమితి ముగిసి రెండున్నరేళ్లు అయిన 12వ వేతన సవరణ కమిషన్‌ను నియమించకపోవడం శోచనీయమన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మానపాటి రవి, మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోండి

గడివేముల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం మండలంలోని అన్ని సచివాలయాల్లో కౌశలం పరీక్షలు నిర్వహిస్తుందని ఎంపీడీవో వాసుదేవగుప్త అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో కౌశలం పరీక్షలు నిర్వహిస్తారన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కొరపోలూరు, వండుట్ల సచివాలయాల్లో నెట్ సౌకర్యం లేనందున గడివేముల సచివాలయంలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మధు

నంద్యాల నూనెపల్లె, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఎదురుగా ఉన్న ప్రధాన కూడలిలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అబిరుచి మధు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 13న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. భారతదేశానికి ఎన్నో సంస్కరణలు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. నేటితరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసులు, బిజ్జం సుబ్బారెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను పొలంలో కాల్చొద్దు

గడివేముల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంట కోత అనంతరం వ్యర్థాలను పొలంలో కాల్చవద్దని మండల వ్యవసాయశాఖ అధికారి పవన్‌కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని దుర్వేసి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది సతీష్, కిరణ్, రైతులు పాల్గొన్నారు.

6నుంచి ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

ఆత్మకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో ఈ నెల 6, 7 తేదీల్లో జరగనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు సాయికుమార్ కోరారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో కార్యక్రమ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి

మిడుతూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులు అధిక రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని ఏడీఏ గిరీష్ అన్నారు. మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో రైతులతో పత్తిలో గులాబి రంగు పురుగు నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నంద్యాల ప్రధాన శాస్త్రవేత్త అశోక్ కుమార్, శాస్త్రవేత్తలు శివరామకృష్ణ, మోహన్ విష్ణువర్ధన్, వ్యవసాయ అధికారి పీరు నాయక్, ఏఈవోలు అశోక్, మల్లికార్జున రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు ఉద్యోగాలు కల్పించాలి

శ్రీశైలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల దేవస్థానంలో గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కొమరంభీం గిరిజన సంఘం అధ్యక్షుడు ఆశీర్వాదం కోరారు. మంగళవారం పరిపాలనా భవనంలో ఆలయ చైర్మన్ రమేషనాయుడును సంఘం ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. వారు మాట్లాడుతూ పల్లకిని మోసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు గంగమ్మతో పలు అంశాలను చైర్మన్ చర్చించారు. పాలకమండలి సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

వెలుగోడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన ఓ మహిళ బంగారు గొలుసు చోరీకి గురైంది. మంగళవారం గ్రామానికి చెందిన నాగమణి వెలుగోడులోని ఎస్‌బీఐలో ఉంచిన బంగారు వస్తువులను విడిపించుకునేందుకు వచ్చారు. తన బ్యాగులో ఉన్న బంగారు గొలుసు కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుమారు 35 గ్రాముల గొలుసు ధర రూ.1.40 లక్షలు ఉంటుందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

మృతదేహం లభ్యం

బండిఆత్మకూరు డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతజూటూరు పికప్ ఆనకట్ట వద్ద మరో మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. మంగళవారం ఉదయం ఆనకట్ట గేట్ల దగ్గరు గుర్తు తెలియని శవాన్ని మత్స్యకారులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈతగాళ్లతో శవాన్ని వెలికి తీయించి నంద్యాల ఆస్పత్రికి తరలించారు. సోమవారం మధ్యాహ్నమే ఒక శవాన్ని వెలికి తీసి వెలుగోడు మండలం రేగడగూరుకు చెందిన పెద్దరామయ్య (65)గా గుర్తించి బంధువులకు అప్పగించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. వరుసగా రెండు రోజులు రెండు మృతదేహాలు అదే ప్రాంతంలో లభ్యమయ్యాయి.

ఆదమరిస్తే అంతే..!

- పల్లె రోడ్లు గుంతలమయం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు

జూపాడుబంగ్లా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల రహదారులు గుంతల మయంగా మారాయి. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి మండలంలోని తరిగోపుల గ్రామానికి వెళ్లే దారిలో గుంతలు ఏర్పడ్డాయి. ప్రమాదాలు జరగకుండా గ్రామస్థులు గుంతల్లో కట్టెల ఏర్పాటు చేసి గుడ్డలు కట్టారు. కొత్తవారు రోడ్డుపై గమనించకుండా వస్తే ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు గుంతలను పూడ్చించి రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. అలాగే తంగడంచ చెక్‌పోస్టు నుంచి పారుమంచాలకు వెళ్లే రహదారి దారుణంగా తయారైంది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడింది. ఏడాదిన్నరక్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారి నాసిరకంగా వేయడంతో అప్పడే ఛిద్రమైంది. ఈ రహదారిలోనే గ్రామానికి కొత్త విద్యుత్ లైను వేసేందుకు గుంతలు తీశారు. దాంతో సమ్మర్‌స్టోరేజీ పైపులైను పగిలిపోయింది. దారి పొడువునా గుంతలు తీసి వదిలేశారు. వెలుగోడు, మద్దూరు, వాడాల, కనకయ్యకొట్టాల మీదుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండురోజుల కిందట గుంతలను తప్పించబోయి లారీ కిందికి దూసుకుపోయింది. పెద్ద ప్రమాదాలు జరుగకముందే అధికారులు పైపులైను పనులు త్వరగా పూర్తి చేసి రహదారికి మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పారుమంచాల ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న పైపులైను గుంత



దెబ్బతిన్న ప్రధాన రహదారి



తరిగోపుల రహదారిలో గుంతలకు సూచికలుగా ఏర్పాటు చేసిన కర్ర

అధికారుల తీరుతో నిధులు వెనక్కి

- మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారుల తీరుతో ఎంపీ నిధులు వెనక్కి వెళ్తున్నాయని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మారుతి నగర్, హాజీ నగర్ కాలనీవాసుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. కమ్యూనిటీ హాల్ కోసం 20 సెంట్లు స్థలం సేకరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించగా, ఆయా కాలనీల్లో ఎలాంటి ప్రభుత్వ స్థలం అధికారులు నివేదిక ఇచ్చారన్నారు. దీంతో ఎంపీ నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు రాజకీయాలు చేయాలనుకుంటే తమ ఉద్యోగాలకు రాజీనామా చేయాలని సూచించారు. అలాగే సంగయ్యపేట, సుబ్బారావుపేట, షికారిపేటలకు అందుబాటులో ఉండేందుకు రూ. 3 కోట్లతో నూతన పీహెచ్‌సీ మంజూరైతే అక్కడ స్థల సేకరణ చేయకుండా ఎవరూ లేని బైరెడ్డి నగర్‌లో స్థల సేకరణ చేయడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ నిధులను కూడా దుర్వినియోగం చేస్తున్నారన్నారు. మున్సిపాల్టీలో ట్రాక్టర్ టయర్లు దెబ్బతింటే.. నూతన టయర్లు ఏర్పాటు చేసేది పోయి నెలకు రూ.40 వేలు చెల్లిస్తూ మరో ట్రాక్టర్‌ను అద్దెకు ఏర్పాటు చేశారన్నారు. ఇలా ఐదు నెలలుగా దాదాపు రూ.2 లక్షలు ట్రాక్టర్ బాడుగ కింద చెల్లించారన్నారు. ట్రాక్టర్‌కు అద్దె చెల్లిస్తూ నిధులు దుర్వినియోగం చేస్తున్నారన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు చాంద్‌బాషా, లాలుప్రసాద్, టీడీపీ నాయకులు సత్యనారాయణలు పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే సంక్షేమం

- విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పార్వతమ్మ



చైర్‌పర్సన్ పార్వతమ్మకు బొకేను ఇస్తున్న సంఘం ప్రతినిధులు

ఆత్మకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే విశ్వబ్రాహ్మణుల సంక్షేమం సాధ్యపడుతోందని ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ అన్నారు. మంగళవారం ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయానికి చేరుకున్న ఆమెను స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మ యువజన పథకం గురించి అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా పనిముట్లను ఉపయోగించుకుని కుల వృత్తిలో రాణించాలని ఆకాంక్షించారు. విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం తమ కార్పొరేషన్ అన్ని విధాలుగా కృషి చేస్తుందని వివరించారు. కాగా కుల వృత్తులకు ఆదరణ తగ్గుతున్న నేపథ్యంలో విశ్వబ్రాహ్మణ మహిళలకు కూడా ప్రోత్సాహాన్ని అందించేలా ప్రభుత్వం కొత్త పథకాలను ప్రవేశపెట్టాలని స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు విశ్వరూపాచారి, సహదేవాచారి, మల్లికార్జున ఆచారి, రాఘవ ఆచారి, రాజగోపాల్ ఆచారి, మల్లయ్య ఆచారి, సత్యనారాయణ ఆచారి, శివయ్య ఆచారి, శంకరాచారి, సురేష్ ఆచారి, కుమార్ ఆచారి, ఓంకారం ఆచారి పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తుల కిటకిట

- స్పర్శ దర్శనాలకు బారులుదీరిన భక్తులు
- వేలాదిగా తరలివస్తున్న శివస్వాములు



ప్రధాన ద్వారం వద్ద శివస్వాములు

శ్రీశైలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శివదీక్షా విరమణల కోసం వివిధ ప్రాంతాల నుంచి శివ స్వాములు వేలాదిగా తరలి వస్తుండటంతో శ్రీశైల క్షేత్రం శివనామస్మరణతో మార్మోగుతోంది. కార్తీక మాసాంతం మండల దీక్షలు పూర్తిచేసుకుని క్షేత్రానికి చేరుకున్న ఇరుముడి స్వాములకు ఉచిత స్పర్శ దర్శనం కల్పిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న స్పర్శ దర్శనం సేవాకర్తలు కూడా ఒక్కసారిగా గర్భాలయ దర్శనాలకు క్యూలైన్లలో వేచి ఉన్నందున ఆలస్యం అవుతోందన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా కంపార్టుమెంట్లలో వేచి ఉండే యాత్రికులకు అల్పాహారాలు, తాగునీరు తదితర వసతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.



శనగల బసవన్నకు పూజలు చేస్తున్న చైర్మన్

శనగల బసవన్నకు త్రయోదశి పూజలు

శ్రీశైల మహా క్షేత్రంలో త్రయోదశి ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిపించినట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ఉన్న కుమారస్వామికి షోడశోపచార పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం బయలు వీరభద్రస్వామికి అభిషేకార్చనలు వైభవంగా జరిగాయి. నందిమండపంలో కొలువైన శనగలబసవన్నకు వివిధ రకాల ఉదకాలు, పంచామృతాభిషేకం, శుద్ధ జలాలతో అభిషేకించి పుష్పార్చనలు చేశారు.

సాంకేతిక పరిజ్ఞానంతో బోధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

గోస్పాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు విద్యాబోధన సాంకేతిక పరిజ్ఞానంలో బోధిస్తే ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మం డలంలోని ఎం చింతకుంట్ల, కానాలపల్లె ప్రాథమిక పాఠశాలలను ఆ యన తనిఖీ చేశారు. విద్యార్థుల పఠన సామర్థ్యాలను, ప్రగతి రిపో ర్టులను పరిశీలించారు. ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ ప్రక్రియను, అంగన్‌వాడీ స్కూళ్లలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్‌కరీం, ఉపాధ్యాయుడు శివనాగిరెడ్డి, సీఆర్ఎంటీ వెంకటేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

నందికొట్కూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6,7 తేదీల్లో కడపలో నిర్వహించనున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సామజిక కార్యకర్త గుజ్జుల గౌరీశ్వర్‌నాయుడు, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు బీబీ, ముత్తుజాబి, ఏసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా యోజనపై రైతులకు అవగాహన

ఆత్మకూరురూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపై మండల వ్యవసాయాధికారి హేమలత రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని కురుకుంద గ్రామంలో మంగళవారం 10వ పంటల బీమా వారోత్సవాల్లో భాగంగా రైతులనుద్దేశించి గ్రామ సభ నిర్వహించారు. పంట బీమాతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అలాగే వరిలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. మినుము విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో రాజశేఖర్, వీపీఏ సాజీద్‌బాష, ఎంపీఈవో ముర్తుజావలి పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

శ్రీశైలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మద్యాన్ని క్షేత్ర పరిధిలోకి తీసుకువచ్చి విక్రయించేందుకు ప్రయత్నించిన యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సున్నిపెంటకు చెందిన కుడుముల చంద్రమౌళి చెంచు మ్యూజియంలో పనిచేస్తుండగా, భూమాని నాగార్జున దేవస్థాన సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. మంగళవారం వారి నుంచి 24 మద్యం బాటిళ్లను, బైకును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోగా కేపీఆర్ శర్మ

కొత్తపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల డిప్యూటీ ఎంపీడీవోగా కేపీఆర్ శర్మ మంగళవారం బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో మేరీ తెలిపారు. గతంలో కర్నూలు మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఆయన కొత్తపల్లికి వచ్చారన్నారు. శర్మ బాధ్యతలు స్వీకరించిన అనంతరం గువ్వలకుంట్ల సచివాలయంలో రికార్డులు పరిశీలించారు.

కొక్కెరంచ జేవీవో బదిలీ

కొత్తపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ పశువైద్యశాలలో జేవీవో విధులు నిర్వహిస్తున్న సుబ్బలక్ష్మి పదోన్నతిపై వేల్పనూరుకు వెళ్లినట్లు దుద్యాల పశువైద్యాధికారి అశోక్ కుమార్ తెలిపారు. కొకెరంచలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న సుబ్బలక్ష్మి వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారిగా (వీఎల్వో)గా పదోన్నతిపై పొందారన్నారు. ఈమె స్థానంలో వెంకటాపురం గ్రామీణ పశువైద్యశాలలో ఎల్ఎస్ఏగా విధులు నిర్వహిస్తున్న హేమ కుమార్ కొక్కెరంచ గ్రామీణ పశువైద్యశాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది

నంద్యాల టౌన్ డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ జయరాములు హెచ్చరించారు. మంగళవారం ఎస్వీఆర్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో డయల్ 112, నేరాలు జరిగినప్పుడు 1930కు కాల్ చేసి సమాచారం ఇస్తే తక్షణ సాయం అందిస్తామన్నారు. అమ్మాయిలు దూర ప్రాంతాలకు పరీక్షలు రాసేందుకు వెళ్తే వన్ స్టాప్ సెంటర్లను ఉపయోగించుకోవాలన్నారు. శక్తి యాప్ గురించి వివరించారు. సమావేశంలో కరస్పాడెంట్ రంగయ్య, మహిళా స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ నారాయణరెడ్డి

పాణ్యం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జేఎన్‌టీయూ బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. జేఎన్‌టీయూ పరిధిలోని కళాశాలలకు చెందిన 80 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ నారాయణరెడ్డి, సురేష్‌బాబు, చంద్రమౌళి వ్యవహరించారన్నారు. ఎంపికైన మహిళా జట్టు తమిళనాడు అన్న యూనివర్సిటీ, పురుషుల జట్టు దాస్ యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీడీ చంద్రారెడ్డి, వెంకటేశ్, వెంకటేశ్‌నాయక్, మునిశంకర్, రామునాయక్ పాల్గొన్నారు.

దుద్యాలలో ముమ్మరంగా రోడ్డు పనులు



పనులు పరిశీలిస్తున్న డీఈఈ వీరన్న, ఏఈఈ వెంకటరమణ

కొత్తపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు వయా దుద్యాల మీదుగా కొక్కెరంచ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మంగళవారం డీఈఈ వీరన్న, ఏఈఈ వెంకటరమణతో కలిసి పనులు పరిశీలించారు. డీఈఈ వీరన్న మాట్లాడుతూ ఆత్మకూరు నుంచి దుద్యాల మీదుగా కొకెరంచ వరకు నిర్మించనున్న రోడ్డుకు రూ.2.20 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆత్మకూరు నుంచి దుద్యాల వరకు పాడైపోయిన బీటీ రోడ్డును పూర్తిగా తొలగించి మరమ్మతులు చేపట్టామన్నారు. బుధవారం పనులను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పరిశీలిస్తారని వివరించారు. డిసెంబరు చివరిలోగా బీటీ నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన, గ్రామీణ (పీఎంజీవైజీ)కింద దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 14వరకు పొడిగించినట్లు హౌసింగ్ పీడీ శ్రీహరి గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో, గ్రామీణ ప్రాంతాల్లో స్థలం ఉన్న పేదలు ఇళ్ల నిర్మాణానికి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

5న వాహనాల వేలం

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఈనెల 5న వేలం వేయనున్నట్లు బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ ఎస్ఐ తిరుపాలు తెలిపారు. వివిధ కేసులలో పట్టుబడిన పది టూవీలర్ వాహనాలు ఉన్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 5న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలందారులు పోలీసు స్టేషన్‌లో సంప్రదించి తగిన ధరావత్తు చెల్లించి పాల్గొనాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పాములపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపెంట గ్రామంలో టీడీపీ కార్యకర్త ఎర్రసాని చిన్న లక్ష్మన్న అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహానికి మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ పూలమాల వేసి నివాళి అర్పించారు. బాధిత కుటుంబానికి రూ. ఏడువేలు ఆర్థికసాయం అందించారు. సింగపూరు తెలుగుసమాజం అధ్యక్షుడు టేకూరి నాగేశ్వరరావు సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో బూత్‌కన్వీనర్ వినయ్, సుబ్బారాయుడు, జీవన్న పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు

పాములపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్మశానం సమీపంలో మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ భాగ్యమ్మ తెలిపారు. మంగళవారం ఉపసర్పంచ్ పుల్లారెడ్డి, అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించి కొలతలు వేశారు. ప్రయాణీకుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిర్మాణాలకు చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు.

6న హిందూ సమ్మేళనం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6న పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో సాయంత్రం 5గంటలకు హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు పార్థసారథి కృష్ణ తెలిపారు. ఆర్ఎస్ఎస్ వందసంవత్సరాలలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హిందూ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ప్రవచన కర్త హరిబాబు, ప్రధానవక్తగా కుటుంబ ప్రబోధక్ ప్రాంత సంయోజక్ పుట్టా శేషు పాల్గొంటారన్నారు. హిందూ బంధువులందరూ హాజరుకావాలని కోరారు.

కంప్యూటర్, భాషా నైపుణ్యాలపై శిక్షణ

పాణ్యం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కంప్యూటర్, భాషా నైపుణాలపై 30 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. నంద్యాల పీఎస్‌సీ, ఏపీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పాణ్యం డిగ్రీ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. సాఫ్ట్ స్కిల్, కమ్యూనికేషన్ స్కిల్, ప్రాధాన్యతలను వివరించారు. కార్యక్రమంలో నంద్యాల డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు పార్వతిదేవి, కోఆర్డినేటర్ ఫరీదా, నరేష్, సుబ్బయ్య, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగుపై కార్యాచరణ రూపొందించాలి

బండిఆత్మకూరు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): సాగుపై కార్యాచరణ రూపొందించాలని మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం బండిఆత్మకూరు వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రబీతో పాటు 2026-27 వ్యవసాయ సంవత్సరంలో ఖరీఫ్, రబీ సాగులకు సంబంధించిన ప్రణాళిక రూపొందించాలన్నారు. ఆర్ఎస్కేలో రైతులతో సమావేశం నిర్వహించి మూడు సాగులపై పక్కా ప్రణాళిక తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, వీఏఏలు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

మహానంది, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయలకుంట్ల మెట్ట వద్ద మంగళవారం ఉదయం మోటారు బైక్‌ను లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో వ్యక్తి గాయపడ్డాడు. గాజులపల్లి గ్రామానికి చెందిన మెదరి వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి మోటార్ బైక్‌పై నంద్యాలకు వెళ్తుండగా బోయలకుంట్ల మెట్ట వద్ద వెనుక వైపు నుంచి లారీ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో గాయపడ్డ వెంకటసుబ్బయ్యను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తీరు మారకపోతే వేటు తప్పదు

సచివాలయ ఉద్యోగులపై ఎమ్మెల్యే కోట్ల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

ప్యాపిలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తీరు మార్చుకోకపోతే వేటు తప్పదని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి, సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశాన్ని నిర్వహిం చారు. కోట్ల మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదన్నారు. గ్రామాల్లో తిరిగి పారిశుధ్యం, తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలన్నారు. అలాగే మండలస్థాయి అధికారులు కూడా సచివాలయాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పనితీరు బాగలేని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు పట్ట ణంలోని రోడ్డు డివైడర్‌పై రూ.30 లక్షలతో నిర్మించనున్న బట్టర్‌ఫ్లై దీపాలకు కోట్ల భూమి పూజ చేశారు. తహసీల్దారు భారతి, డీఎల్‌డీవో నరసింహారెడ్డి, సీఐ వెంకటరామిరెడ్డి, వై లక్ష్మీనారాయణయాదవ్, టి శ్రీను, ఖాజాపీర్, పరమేష్, సుదర్శన్, రామక్రిష్ణ, అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ/శిరివెళ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.10లక్షల చెక్కును బాధిత కుటుంబానికి మంగళవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అందజేశారు. శిరివెళ్లకు చెందిన గాజుల రిజ్వాన్ అనే యువకుడికి రెండు కిడ్నీలు చెడిపోవడంతో ఎమ్మెల్యే అఖిలప్రియ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన రూ10.లక్షల చెక్కును మంజూరు చేయించారు. ఈ చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మద్యం తాగి వాహనాలను నడిపితే చర్యలు

ఆళ్లగడ్డ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడిపితే చర్యలు తప్పవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) రవిశంకర్ నాయక్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో ఆళ్లగడ్డ, దొర్నిపాడు, ఎర్రగుంట్ల కళాశాలలకు చెందిన బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనానికి అత్యవసర ద్వారం వద్ద ఎటువంటి అడ్డంకులు ఉండకూడదని, అప్పర్ ఇండికేటర్ లైట్స్ ఉండాలని అన్నారు. అలాగే హ్యాండ్ బ్రేక్ సాధారణ బ్రేక్‌లలో ఏమైనా లోపాలు ఉంటే బస్సుల యజమానులు వెంటనే సరిచేసుకోవాలన్నారు. ఆయన వెంట స్థానిక పోలీసు అధికారులు ఉన్నారు.

ప్రైవేటు స్కూళ్ల బస్సుల తనిఖీ

బేతంచెర్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల బస్సు లను మంగళవారం డోన్ ఎంవీఐ క్రాంతి కుమార్ తనిఖీ చేశారు. బస్సు పత్రాలు, భద్రతా పరికరాలు, ఇతర సురక్షిత ప్రయాణాలు పరిశీలించారు. అలాగే నాపరాళ్ల రవాణా చేసే ట్రాక్టర్లను కూడా ఆయన తనిఖీలు నిర్వహించారు. వీటిలో రోడ్ ట్యాక్స్ కట్టని మూడు ట్రాక్టర్ల ట్రాలీలకు 72,210లు జరిమానా విధించామన్నారు. పోలీసులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కోవెలకుంట్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోవెలకుంట్ల మండల విద్యాశాఖధి కారులు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్యలు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ అమరావతి డైరెక్టర్, నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు అకాడ మిక్ ఇన్‌స్ట్రక్చర్స్‌ను నియమించుకోవాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. వారి ఆదేశాల మేరకు కోవెలకుంట్ల ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎస్ఏ(ఫిజికల్ సైన్స్), ఎస్ఏ(ఉర్దూ) పోస్టులకు అర్హులైన వారు ఈ నెల 5వ తేదీ లోపు కోవెలకుంట్ల ఎంఈవో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

రైతులను ఆదుకోవడంలో విఫలం: బుగ్గన


అరటి రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన

ప్యాపిలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అరటి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం మండలంలోని హుసేనాపురం, చంద్రపల్లి, పెద్దపాయకొట్టాల, పీఆర్‌పల్లి గ్రామాల మీదుగా దాదాపు 10కి.మీ. పాద యాత్రగా వెళ్లి అరటి తోటలను పరిశీలించారు. అరటి కొనేవారు లేకపో వడంతో పంటను తోటల్లోనే వదిలేశామని రైతులు ఆయనకు విన్నవించారు. బుగ్గన మాట్లాడుతూ అరటి రైతులకు వైసీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాంసాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, రాష్ట్ర వైసీపీ రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వైసీపీ విభాగం కార్యదర్శి మెట్టు వెంకటేశ్వరరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, బోరెడ్డి రాము, ప్రేమసాగర్‌రెడ్డి, వి శ్రీనివాసరెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో విశ్రాంత హెచ్‌ఎం మృతి


నారాయణరెడ్డి(ఫైల్)

చాగలమర్రి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతబస్టాండు వీధిలో నివాసం ఉంటున్న విశ్రాంత హెచ్‌ఎం నారాయణరెడ్డి (82) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్టీయూ, పీఆర్టీ యూ, పెన్షనర్ల సంఘం నాయకులు మృతదేహంపై పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మౌలాలి, బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, మైనార్టీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, మాబుషరీఫ్, కార్యదర్శి అస్రఫ్, గ్రామ ఉపసర్పంచ్ సోహెల్ సంతాపం తెలిపారు.

భారీగా తగ్గిన దిగుబడి

- ఎకరాకు క్వింటం మాత్రమే
- మినుము పంటను దున్నేస్తున్న రైతులు

చాగలమర్రి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో మినుము దిగుబడి భారీగా తగ్గింది. మండలంలో 2,800 ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో మినుము పంట దిగుబడి భారీగా తగ్గింది. ఒక్కో రైతు రెండుసార్లు మినుము విత్తనం వేశారు. ఎకరాలకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టారు. దిగుబడి మాత్రం ఎకరాకు ఒక క్వింటం మాత్రమే వచ్చిందని రైతులు లబోదిబోమంటున్నారు. మినుములు కూడా నాసిరకంగా ఉన్నాయని వ్యాపారులు కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు మినుము పంటను కోత కోయకుండానే వదిలేయగా మరి కొందరు ప్రత్యామ్నాయ పంట సాగు చేసుకునేందుకు దున్నేస్తున్నారు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా క్వింటా దిగుబడి మాత్రమే రావడంతో రైతులు విలవిలలాడుతున్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


చింతల చెరువులో నల్లబారిన మినుము పంట

ఎకరాకు క్వింటం మాత్రమే దిగుబడి



ఎకరాకు 8 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల మినుము దిగుబడి రావాల్సి ఉండగా కేవలం ఎకరాకు క్వింటా మాత్రమే మినుము దిగుబడి వచ్చింది. రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయా. ప్రభుత్వమే ఆదుకోవాలి.

● శేఖర్‌రెడ్డి, రైతు, మూడురాళ్లపల్లె

కొంప ముంచిన వర్షాలు



మినుము పంట చేతికందే సమయంలో వర్షాలు కొంప ముంచాయి. 9 ఎకరాల్లో మినుము సాగు చేశా. ఎకరాకు 2 క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదు. ధర కూడా భారీగా తగ్గింది. రూ.2.70 లక్షలు పెట్టుబడి పెట్టా. పెట్టుబడి కూడా చేతికందలేదు.

● నరసింహారెడ్డి, రైతు, మూడురాళ్లపల్లె

నాట్..వర్క్

- ఇబ్బందుల్లో సెల్‌ఫోను వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు
- రూ. కోట్లు దండుకుంటున్న నెట్‌వర్క్ సంస్థలు

కొలిమిగుండ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వినియోగదారులకు ఇటీవలే కాలంలో సమస్యలు ఎక్కువైంది. కోట్లాది మంది యూజర్లను కలిగి ఉన్న నెట్‌వర్క్ కంపెనీలు వినియోగదారులకు మెరుగైన సేవలందించడంలో తమ నిర్లక్ష్యాన్ని వీడటంలేదు. వివిధ రకాల ప్యాకేజీల పేరుతో యూజర్ల నుంచి కోట్లు దండుకుంటున్న కంపెనీలు వారికి సరైన సిగ్నల్స్ అందించడంలో విఫలమవుతున్నాయి. దీంతో సెల్ వినియోగదారులు నెట్‌వర్క్ సమస్యలతో సతమతమవుతున్నారు. కొలిమిగుండ్ల మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 32 గ్రామాలు ఉండగా, ఎయిర్‌టెల్, జియో వినియోగదారులు సుమారు 2లక్షల మంది ఉన్నారు. అయితే యూజర్లకు తగ్గ సిగ్నల్స్ లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో రామ్‌కో, అల్ట్రాటెక్ పరిశ్రమలు సైతం నెలకొని ఉండటంతో లక్షలాది మంది యూజర్లు ఈపరిధిలోని టవర్ల కింద ప్రతి రోజూ సెల్ ఫోన్స్ ఉపయోగిస్తున్నారు. సామర్థ్యంలేని సెల్ టవర్లతోనే ఏళ్ల తరబడి సంస్థలు నెట్టుకొస్తుండటంతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందని ద్రాక్షలా మారాయి.



ఫోన్ మాట్లాడుతుండగానే..

నెట్‌వర్క్ సమస్య కారణంగా ఫోన్ మాట్లాడుతుండగానే కాల్ కట్ కావడం .. మళ్లీ ప్రయత్నిస్తే ఎంతకీ కాల్ కలవకపోవడం.. కాల్ జంప్ కావడం .. కాల్ కలిసినా వినిపించకపోవడం.. హలో .. హలో .. అంటూ విసుగెత్తేలా అరవాల్సిన పరిస్థితి. యూజర్ల సంఖ్యను బట్టి టవర్లు ఏర్పాటు, సామర్థ్యం పెంపు లేకపోవడం తోనే ఈసమస్యలు అధికమయ్యాయని నిపుణులు పేర్కొంటున్నారు.

చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా

నెట్‌వర్క్ సమస్యలపై సంబంధిత కంపెనీలపై చర్యలు తీసుకునే అవకాశం ప్రభుత్వానికి ఉంటుంది. అయినా అధికారులు తమకేమీ సంబంధం లేదు అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. ఇక వినియోగదారులు కూడా సిగ్నల్స్ సమస్యలపై సర్దుకుపోతున్నారే తప్ప ఫిర్యాదు చేయడం లేదు. ప్రభుత్వాలు ఇప్పటికైనా నెట్‌వర్క్ సంస్థలపై దృష్టి సారించి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి


మంత్రి బీసీకి సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

బనగానపల్లె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంత్రి బీసీ వినతులను స్వీకరించారు. అప్పటికప్పుడే కొన్ని సమస్యలను అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించారు. కొన్ని సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పొలం వివాదాలు, వ్యక్తిగత సమస్యలు మంత్రి దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు.

చౌడేశ్వరీమాత సన్నిధిలో బీసీ రాజారెడ్డి


బీసీ రాజారెడ్డికి తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ చైర్మన్ పీవీ నాగార్జునరెడ్డి, పీవీ కుమార్‌రెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ మాతను బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మంగళ వారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పీవీ నాగార్జునరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డిలు బీసీ రాజారెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం బీసీ రాజారెడ్డికి వారు, ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా ఎంపికైన పీవీ. నాగార్జునరెడ్డిని బీసీ రాజారెడ్డి అభినందించారు. ఈసందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ పీవీ నాగార్జునరెడ్డి హ యాంలో ఆలయాభివృద్ధి మరింత జరగాలని ఆకాంక్షించారు. అలాగే గత టీడీపీ హయాంలో చైర్మన్‌గా ఉన్న పీవీ.కుమార్‌రెడ్డి చౌడేశ్వరీమాత ఆల యానికి మూడు రాజగోపురాలు నిర్మించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వెంగన్న, ఆలయ పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు ప్రపంచానికే ఆదర్శం

బనగానపల్లె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడి బోధనలు ప్రపంచానికే ఆదర్శమని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానం దాచారి అన్నారు. మంగళవారం పలుకూరులోని రామాలయంలో బుద్ధుడి బోధనలపై సదస్సు నిర్వహించారు. బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రహ్మానందాచారి మాట్లాడుతూ గౌతమబుద్ధుడు రాజైనా అన్నింటిని త్యజించి సమాజానికి మంచి బోధనలు అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈసందర్భంగా బుద్ధుడి బోధన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య గౌడ్, గణేశ్, వేణు, ఆంజనేయస్వామి భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం: ఎస్ఐ

బనగానపల్లె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతి రోజు వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని బనగానపల్లె ఎస్ఐ ఎస్ఐ దుగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలో ధాత్రి ఇంగ్లీషు మీడియం విద్యార్థులు ఫిట్ ఇండియా ర్యాలీ నిర్వహిం చారు. ర్యాలీలో ఎస్ఐ దుగ్గిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చౌదరి, గోవింద్, సురేష్, తస్లీం, హరీశ్, హైమావతి, స్వర్ణలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పరీక్షల పరిశీలన

చాగలమర్రి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీటెక్ పూర్తి చేసిన నిరుద్యో గులకు ప్రభుత్వం కౌసల్యం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. మంగళవారం 17 సచివాల యాల పరిధిలో జరుగుతున్న ఆన్‌లైన్ పరీక్షలను ఎంపీడీవో తాహిర్ హుసేన్, డిప్యూటీ ఎంపీడీవో తారకేశ్వరి పరిశీలించారు. వారు మాట్లాడుతూ 34 మందికి గాను 13 మంది ఆన్‌లైన్ పరీక్షలకు హాజరయ్యారన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన బీటెక్ విద్యార్థులకు వర్క్ ఫ్రం హోమ్ కింద ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. వీరి వెంట ఎంసీవో రాజ్ కుమార్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

హెల్మెట్ తప్పనిసరి: ఎస్ఐ

చాగలమర్రి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సురేష్ సూచించారు. మంగళవారం 40వ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. 43 మంది వాహనదారులకు రూ.38,500 జరిమానా విధించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా చంద్రమౌళి

దొర్నిపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు డిప్యూ టీ ఎంపీడీవోగా చంద్రమౌళి బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో సావిత్రి తెలిపారు. దొర్నిపాడు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శైలజ పదోన్నతిపై అన్నమయ్య జిల్లా నందలూరు మండలానికి డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఆళ్లగడ్డలో విధులు నిర్వహిస్తున్న చంద్రమౌళి డిప్యూటీ ఎంపీడీవోగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చంద్రమౌళి మాట్లాడుతూ మండలపరిషత్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి

చాగలమర్రి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఈవోగా పని చేస్తున్న తారకేశ్వరి డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవోగా తారకేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని సూచించారు.

కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

కోవెలకుంట్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. స్థానిక వాసవి బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం కంప్యూటర్ అప్లికేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపల్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి అవసరమన్నారు. అనంతరం కళాశాల కంప్యూటర్ అధ్యాపకుడు భాస్కర్ నాయక్ మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రకాల కంప్యూటర్ల నమూనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, లక్ష్మీదేవి, రమణారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నరేం ద్రనాథ్ రెడ్డి, చంటిరెడ్డి, షాహనాజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు క్రీడల్లో రాణించాలి

రుద్రవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు క్రీడల్లో రాణించాలని ఎంఈవోలు వీరరాఘవయ్య, లక్ష్మి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మండల స్థాయి ఉపాధ్యాయ క్రీడా పోటీలను ఎంఈవో వీరరాఘవయ్య ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఉపాధ్యాయులకు క్రికెట్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను డివిజన్ స్థాయిలో 13, 14 తేదీల్లో క్రీడల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 లక్ష్మి, హెచ్‌ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

సంజామల: ఉపాధ్యాయులు ఒత్తిడిని జయించి క్రీడల్లో రాణించాలని ఎంపీడీవో సాల్మన్ అన్నారు. సోమవారం సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు రమణారెడ్డి, ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ క్రీడా పోటీలను ఎంపీడీవో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులను క్రీడా పోటీలను ఏర్పా టు చేయడం సంతోషదాయకమన్నారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలను ఏర్పాటు చేశారు. వ్యాయామ సంచాలకులు బాషా పర్య వేక్షణలో పోటీలు జరిగాయి. పీడీలు మౌలాలి, నాగలక్ష్మి , సీఆర్‌ఎంపీ హుసేన్ బాషా పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ గోపాల్ అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంఈవో అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల క్రీడా పోటీలను అధికారులు ప్రారంభించారు. హెచ్‌ఎం కొండప్ప, సుంకన్న, రమణయ్య, పీఈటీ నాగరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవుకు: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈపోటీలను ఎంఈవో శ్రీధర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులకు క్రికెట్, త్రోబాల్ పోటీలను నిర్వహించామన్నారు. ప్రతిభ కనపరచిన ఉపాధ్యాయులు డివిజన్ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


రుద్రవరంలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో వీరరాఘవయ్య


సంజామలలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో సాల్మన్


అవుకులో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో శ్రీధర్‌రావు

పశుసంపద అభివృద్ధికి చర్యలు తీసుకోండి

సంజామల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పశుసంపద అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు కొండారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో పశు వైద్యాధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 'రైతన్న మీ కోసం'లో భాగంగా మంగళవారం మండల వ్యాప్తంగా ఉన్న రైతు సేవా కేంద్రాలకు హాజరై వ్యవసాయ శాఖ అనుసంధానంతో పని చేస్తున్న పశువైద్య సిబ్బంది రైతులకు అవసరమైన వాటిని గుర్తించి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు క్రిష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం

చాగలమర్రి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని డీఎల్పీవో రాంబాబు అన్నారు. మంగళవారం చాగలమర్రి మేజర్ పంచాయతీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.10 కోట్లు పన్ను వసూలు చేయాల్సి ఉందని అన్నారు. ఎంపీడీవో తాహిర్‌హుసేన్, డిప్యూటీ ఎంపీడీవో తారకేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ

బేతంచెర్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌పీజీ పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ మీట్‌లో బేతంచెర్ల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు టీఆర్‌డీ నాగరాజు, వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కే.రాజేష్ అండర్-17 విభాగంలో షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం సాధించారన్నారు. అలాగే జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానం కైవ సం చేసుకున్నారన్నారు. మండలంలోని కొలుములపల్లె గ్రామానికి చెం దిన దిలీప్ అండర్-20 విభాగంలో షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, డిస్కస్ త్రోలో ప్రథమ స్థానం, పరుగు పందెంలో 200 మీటర్లలో 3వ స్థానం సాధించారని అన్నారు. గెలుపొందిన విద్యార్థులను డీఈవో జనార్దన్ రెడ్డి, బిషప్ సంతోష్ ప్రసన్నరావు ప్రశంసాపత్రాలను అందజేశారు.

దత్త జయంతి వేడుకలు ప్రారంభం

డోన్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజోతి): మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. పురోహితులు కల్లె శేషావలి శర్మ ఆధ్వర్యంలో మహా గణపతి, నవగ్రహ శాంతి, కుబేర సహిత అష్టలక్ష్మి యాగాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నేల సంరక్షణ అందరి బాధ్యత

కొలిమిగుండ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నేల సంరక్షణ అందరి బాధ్యత అని ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యజమాన్య సంస్థ) అధికారి హరిబాబు, వ్యవ సాయ విస్తరణ అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక మోడల్‌స్కూల్‌లో గ్రామ వ్యవసాయ సహాయకులు సుబ్రహ్మణ్యం, శాంతి ఆధ్వర్యంలో నేల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

డోన్ పట్టణాభివృద్ధికి కృషి: మున్సిపల్ చైర్మన్

డోన్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణాభివృద్ధికి కృషి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. మంగళ వారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తన చాంబర్‌లో అధికారులతో, సచివాలయ అమ్యూనిటీస్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని కొళాయి కనెక్షన్లు 305 డబుల్ ఎంట్రీ ఉన్నందున వాటిని తొలగించేందుకు కౌన్సిల్‌లో తీర్మాణం చేసి సీడీఎంఏకి పంపుతామన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, మున్సిపల్ డీఈ రఘు, ఏఈ సురేష్, సచివాలయ అమినిటీస్ పాల్గొన్నారు.

శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఉయ్యాలవాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శనగ పంట సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డివిజన్ వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సర్వాయిపల్లె, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో పర్యటించి శనగ పంటను ఆయన పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ ఎండు, వేరుకుళ్లు తెగుళ్లు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఏవో శ్రీనివాసరెడ్డి, వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా తప్పెట ప్రసాద్

బనగానపల్లె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన తప్పెట ప్రసాద్‌ను బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా మంగళవారం నియమించారు. నంద్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఆయనను ఎన్నుకున్నారు. తప్పెట ప్రసాద్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

రెవెన్యూ డివిజన్‌తో భూ సమస్యలు పరిష్కారం

కొలిమిగుండ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బనగాపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో భూసమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు శివనారాయణ, గోపాల్‌గారి దస్తగిరి మాదిగ అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండులో ఎమ్మార్పీస్, వీహెచ్ పీఎస్ ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

రూ.6.5 లక్షలతో ఐరన్ టవర్ ఏర్పాటు

డోన్ టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 32వ వార్డు శ్రీనివాస్ నగర్‌లో 15 ఏళ్లుగా రహదారిని అడ్డగించిన ఏడు కరెంటు స్తంభాలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న విషయాన్ని కాలనీ వాసులు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడును చర్యలకు ఆదేశించగా.. కౌన్సిల్ తీర్మానం ఆమోదం తర్వాత రూ.6.5 లక్షల విడుదల చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పనులు ప్రారంభించారు. విద్యుత్ ఏఈ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పాత స్తంభాలను తొలగించి కొత్త జీ1ఎం+6 పెద్ద ఐరన్ టవర్‌ను ఏర్పాటు చేశారు.